క్లుప్తంగా

రూ. 1.63 లక్షలు పలికిన ఆంజనేయస్వామి లడ్డూ



కృత్తివెన్ను: హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా వేలంలో స్వామివారి లడ్డూ రూ. 1.63 లక్షలు పలికింది. కృత్తివెన్ను మండలంలోని గాంధీనగరం గ్రామంలో శ్రీఅభయాంజనేయ స్వామివారి దేవస్థానంలో హనుమజ్జయంతి ఉత్సవాలు మంగళవారం ముగిశాయి. ఈ సందర్భంగా 15.1 కేజీల స్వామివారి లడ్డూను వేలంలో స్థానికుడైన ప్రత్తి రామాంజనేయులు రూ. 1.63 లక్షలకు కైవసం చేసుకున్నారు. ఆయనను కమిటీ సభ్యులు దుశ్శాలువాతో సత్కరించి లడ్డూను అందజేశారు.

ముగిసిన ఏపీ ఈఏపీసెట్

పెడన: మండల పరిధిలోని నందమూరు శ్రీవాసవి ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఏపీ ఈఏపీసెట్ ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్ష మంగళవారంతో ముగిశాయి. ఉదయం జరిగిన సెషన్‌లో 179 మందికి గాను 170 మంది హాజరయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ బీఆర్ఎస్ రెడ్డి, అడ్మిన్ అశోక్ కుమార్ తెలిపారు. మధ్యాహ్నం ఈ పరీక్ష జరగలేదన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పరీక్ష ప్రశాంతంగా జరిగిందని వారు పేర్కొన్నారు.

పోషకాహారంతో ఆరోగ్యం

పెడన: పోషకాలున్న ఆహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని మహిళా సంరక్షణ కార్యదర్శులు తెలిపారు. మంగళవారం పట్టణంలోని పలు వార్డు సచివాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాల వద్ద కిశోర వికాసం కార్యక్రమంలో భాగంగా యుక్త వయస్సు బాలికలకు అవగాహన కల్పించినట్లు పేర్కొన్నారు. చదువు పట్ల ఆసక్తి చూపాలని, సెల్‌ఫోన్ల జోలికి పోవద్దని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, అంగన్‌వాడీలు, విద్యార్థినులు పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



మోపిదేవి: శ్రీఅభయాంజనేయ స్వామివారి నూతన శిలా విగ్రహ ప్రతిష్ఠాపన కుంభాభిషేక మహోత్సవాన్ని మంగళవారం ప్రారంభించారు. మండల కేంద్రం మోపిదేవిలో చల్లపల్లి రోడ్డులోని 11వ నంబర్ కాలువ గట్టుపై విగ్రహ ప్రతిష్ఠలో భాగంగా ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం వాస్తు పూజా హోమం, ప్రవేశబలి అనంతరం ప్రత్యేక వాహనంపై శోభాయాత్ర నిర్వహించారు.

రేపు రామలింగేశ్వరునికి శనగలతో అభిషేకం

నాగాయలంక: నాగాయలంక కృష్ణానది తీరంలోని శ్రీరామపాదక్షేత్రం ఘాట్‌లోని శ్రీరామలింగేశ్వరస్వామి మండపంలో గురువారం సాయంత్రం 108కేజీల శనగలతో అభిషేకం, అలంకరణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు క్షేత్రం చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహాశివుడి జన్మనక్షత్రం(ఆర్ద్ర) పురస్కరించుకుని సాయంత్రం ప్రదోష కాలంలో అభిషేకం, విశేష పూజ జరుగుతాయన్నారు. భక్తులు సైతం శనగలు తీసుకొచ్చి స్వామివారికి స్వయంగా సమర్పించవచ్చునని పేర్కొన్నారు.

30న రక్తదాన శిబిరం

పెడన: ప్రభుత్వ అధికారుల సహకారంతో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ నెల 30వ తేదీన ఉచిత రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు ఇన్‌ఛార్జి తహసీల్దారు కే అనిల్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెడన మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశం హాలులో ఉదయం 9.30 గంటలకు జరిగే ఈ శిబిరంలో ఔత్సాహికులు పాల్గొని రక్తదానం చేయాల్సిందిగా ఆయన పిలుపునిచ్చారు. రక్తదానం చేయడం వల్ల పలువురికి ప్రాణ దానం చేసినవారవుతారని పేర్కొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖనంపై శిక్షణ

గూడూరు: గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో గూడూరులో నిర్వహిస్తున్న వేసవి శిబిరం సందడిగా సాగుతోంది. లైబ్రేరియన్ వై.శ్రీనివాసరావు ప్రత్యేక శ్రద్ధతో నిర్వహిస్తున్న శిబిరంలో మంగళవారం విద్యార్థులకు చిత్రలేఖనంలో మెలుకువలు నేర్పించారు. శిక్షణలో ఆకట్టుకునే చిత్రాలు రూపొందిస్తూ చిన్నారులు సందడిగా గడిపారు.

ప్రభుత్వ కార్యాలయాలకు నెట్ సౌకర్యం

తెలుగురావుపాలెం(ఘంటసాల): ఘంటసాల మండలం తెలుగురావుపాలెం గ్రామంలోని గ్రామ రెవెన్యూ కార్యాలయం, రైతు సేవా కేంద్రంలో నెట్ సౌకర్యం లేక ప్రభుత్వ పథకాల నమోదుకు గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న తెలుగురావుపాలెంకు చెందిన గుత్తికొండ చారిటబుల్ ట్రస్టు అధినేత గుత్తికొండ కళ్యాణ్ తన సొంత ఖర్చులతో మంగళవారం హైస్పీడ్ ఇంటర్ నెట్ కనెక్షన్ ఇప్పించడంతోపాటు దానికి నెలవారీ అయ్యే బిల్లును కూడా తామే భరిస్తామని తెలిపారు. ట్రస్టు ప్రతినిధులకు అధికారులు కృతజ్ఞతలు తెలిపారు.

శిథిలావస్థలో కొత్తమాజేరు వంతెన

- మూడు గ్రామాలకు ఇదే వంతెన
- ప్రమాదకరంగా రాకపోకలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు



గుండేరు కాలువపై ప్రమాదకరంగా ఉన్న కొత్తమాజేరు వంతెన

చల్లపల్లి: చల్లపల్లి మండలంలోని కొత్తమాజేరు పరిసర ప్రాంత ప్రజలు రాకపోకలు సాగించే గుండేరు కాలువపై ఉన్న వంతెన శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా ఉంది. 52 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ వంతెన ప్రస్తుతం దయనీయంగా మారింది. పిల్లర్లు బీటలు వారుతున్నాయి. వంతెనకు పెచ్చులు ఊడి ఇనుప చువ్వలు బయటపడుతున్నాయి. అలాగే వంతెన సైడ్‌వాల్స్ పూర్తిగా దెబ్బతిన్నాయి. కొన్ని చోట్ల రెయిలింగ్ పూర్తిగా విరిగిపోయి ప్రమాదకరంగా మారాయి.

ఇదొక్కటే మార్గం

చల్లపల్లి – మచిలీపట్నం 216 జాతీయ రహదారి దగ్గరగా ఉండటంతో కొత్తమాజేరు, భోగిరెడ్డిపల్లి, రామఖండం మూడు గ్రామాల ప్రజలు ఈ మార్గం ద్వారానే రాకపోకలు సాగిస్తుంటారు. చినయాదర, పెదయాదర, నెలకుర్రు గ్రామాలకు చెందిన వారు కూడా అడపాదడపా ఇటే వెళుతుంటారు. అలాగే రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్‌కు తరలించుకునేందుకు కూడా ఈ వంతెన ఎంతగానో ఉపయోగపడుతోంది. పాత మాజేరు, యండకుదురు, జీలగలగండి, పచ్చావారిలంక గ్రామాలకు చెందిన హైస్కూల్ విద్యార్థులు నిత్యం ఈ మార్గంలోనే కొత్తమాజేరులో ఉన్న జెడ్పీ హైస్కూల్‌కు వెళ్లి వస్తుంటారు. వంతెన వద్దకు రాగానే పిల్లలు సైకిల్ తొక్కడానికి భయపడి నడిపించుకుంటూ వెళుతున్నారని స్థానికులు చెపుతున్నారు.



బీటలు ఇచ్చిన వంతెన పిల్లర్

ప్రమాదాలకు నిలయం

ఈ మార్గంలో రాకపోకలు సాగించాలంటే స్థానిక ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఈ వంతెనపై సైడ్ రెయిలింగ్ పాడైపోవడం, కొన్ని చోట్ల పూర్తిగా విరిగిపోవడంతో గతంలో కొందరు అదుపు తప్పి వంతెనపై నుంచి పక్కనున్న గుండేరులో పడి గాయాలపాలైన సంఘటనలు కూడా ఉన్నాయని స్థానికులు చెపుతున్నారు. రాత్రిళ్లు వాహనాలపై వెళ్లే వారికి ఎదురుగా వాహనాలు వచ్చినప్పుడు లైట్ల కాంతికి దారి కనిపించక ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సి వస్తోందని గగ్గోలు పెడుతున్నారు.

కొత్త వంతెన నిర్మించాలి



ప్రస్తుతం సింగిల్ రోడ్డుగా ఉండి శిథిలావస్థకు చేరిన వంతెన స్థానంలో ఎదురెదురుగా వచ్చేవారికి ఇబ్బంది లేకుండా రెండు వరుసల కొత్త వంతెన నిర్మించాలి. పెరిగిన జనాభా, వాహనాల రద్దీ కారణంగా పాత వంతెన సరిపోవడం లేదు. – బెల్లపు హరిబాబు, ఆర్‌ఎంపీ వైద్యుడు, కొత్తమాజేరు

వంతెనపై వెళ్లాలంటే భయం



నేను 30 ఏళ్ల నుంచి ఇక్కడ ఉంటున్నా. అంతకు ముందే ఈ వంతెన కట్టారు. రాత్రిళ్లు వంతెనపై వెళ్లాలంటే భయం వేస్తోంది. కొత్త వంతెన కట్టాలని కోరుకుంటున్నాం. – అరేపల్లి శ్రీనివాసరావు, రైతు, కొత్తమాజేరు

రూ. 10కోట్లతో అంచనాలు పంపాం



కొత్తమాజేరు కొత్త వంతెనకు రూ. 10కోట్లతో ప్రతిపాదనలు పంపాం. ప్రస్తుతం ఐదున్నర మీటర్ల వెడల్పుతో 12 ఖానాలతో ఉన్న పాత వంతెన స్థానంలో ఎనిమిది మీటర్ల వెడల్పులో ఎనిమిది ఖానాలతో కొత్తవంతెన నిర్మాణానికి నాబార్డుకు, డిపార్టుమెంట్‌కు అంచనాలు పంపాం. అనుమతులు రాగానే పనులు ప్రారంభిస్తాం. – పి.సురేష్, ఆర్‌అండ్‌బీ ఏఈ, మచిలీపట్నం

8లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వ ఉండాలి

కలెక్టర్ డీకే బాలాజీ



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ, చిత్రంలో జేసీ గీతాంజలిశర్మ

చిలకలపూడి(మచిలీపట్నం): ఈ నెలాఖరుకు జిల్లాలోని ఆరు స్టాక్ పాయింట్లలో 8లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వ చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టర్ డీకే బాలాజీ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జాయింట్ కలెక్టర్ గీతాంజలిశర్మతో కలిసి జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ వర్షాకాలం రానున్న నేపథ్యంలో ప్రజల అవసరాల కోసం 8లక్షల మెట్రిక్ టన్నుల ఇసుకను తప్పనిసరిగా నిల్వ చేయాలన్నారు. చోడవరం, నార్త్‌వల్లూరు, పడమటలంక, రొయ్యూరు, రొయ్యూరు సెమీ మెకనైజ్డ్, శ్రీకాకుళం ఆరు స్టాక్ పాయింట్లలో ఇప్పటికే 6,15,987 మెట్రిక్ టన్నులు ప్రజలకు అందుబాటులో ఉందన్నారు. మెట్రిక్ టన్ను ఇసుక రూ. 155లుగా నిర్ధారించామని తెలిపారు. జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో గనులు, పోలీస్, జలవనరులశాఖ అధికారుల కమిటీ ఈ నెల 31వ తేదీన అన్ని స్టాక్ యార్డులను తనిఖీ చేసి ఇసుక నిల్వ వివరాల నివేదిక అందజేయాలని సూచించారు. సమావేశంలో ఏఎస్పీ సత్యనారాయణ, మైనింగ్ ఏడీ శ్రీనివాసకుమార్, ఏజీ కొండారెడ్డి, జయవర్ధన్, ఆర్డీవో శ్రీనివాసరావు, ఇరిగేషన్ ఈఈ కిరణ్, డీఎస్పీ సీహెచ్ రాజా తదితరులు పాల్గొన్నారు.

నాణ్యత లోపిస్తే ఉపేక్షించేది లేదు

క్వాలిటీ కంట్రోల్ ఎస్ఈ వెంకటేశ్వరరావు



జయపురం – వి.కొత్తపాలెం గ్రామాల మధ్య బీటలు వారిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కోడూరు: కోడూరు – అవనిగడ్డ ప్రధాన రహదారి నిర్మాణంలో నాణ్యత లోపిస్తే ఉపేక్షించేది లేదని క్వాలిటీ కంట్రోల్ ఎస్ఈ వెంకటేశ్వరరావు, ఆర్అండ్‌బీ ఎస్ఈ టి.సత్యన్నారాయణ స్పష్టం చేశారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కేటాయించిన రూ. 16.80కోట్లతో నూతనంగా నిర్మిస్తున్న కోడూరు – అవనిగడ్డ ప్రధాన రహదారి పనులను మంగళవారం వారు పరిశీలించారు. రహదారి నిర్మాణాన్ని పటిష్టంగా చేపట్టడంతోపాటు నాణ్యత ప్రమాణలను పాటించాలని సూచించారు. ప్రస్తుతం ఎనిమిది కిలోమీటర్ల మేర రహదారి బీటీ నిర్మాణ పనులు పూర్తయినట్లు గుత్తేదారు అధికారులకు తెలిపారు. నిర్మాణ పనులను ఎస్ఈలు పరిశీలించి గుత్తేదారుకు పలు సూచనలు చేశారు. ఆర్అండ్‌బీ అధికారులు నాణ్యతపై దృష్టి సారించాలని, లేకపోతే చర్యలు తప్పవని ఎస్ఈలు హెచ్చరించారు. బీసీ రోడ్డును కొంత పరిమాణాల్లో తవ్వి శాంపుల్స్‌ను సేకరించారు. కాగా కోడూరు – అవనిగడ్డ ప్రధాన రహదారి నిర్మిస్తుండగా బీటలు వారుతుందంటూ ఇటీవల పత్రికల్లో కథనాలు రావడంతో ఆ ప్రాంతాన్ని కూడా అధికారులు పరిశీలించారు. క్వాలిటీ కంట్రోల్ ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మరంగా మెట్ట దుక్కులు



మల్లేశ్వరంలో పొలం దుక్కులు దున్నుతున్న రైతు

బంటుమిల్లి: మండల పరిధిలోని గ్రామాల్లో రైతులు మెట్ట దుక్కులు ముమ్మరంగా చేపట్టారు. ఈ నెలలో కురిసిన భారీ వర్షాలకు భూమిలో పదును అనుకూలంగా ఉండటంతో దుక్కులు మొదలుపెట్టారు. ఈ ఏడాది రుతుపవనాలు ముందుగా రావడంతో సార్వా సాగు ముందుగానే ప్రారంభమయ్యే అవకాశం ఉందని పలువురు రైతులు పేర్కొన్నారు. దుక్కులు దున్నడం వల్ల వర్షం నీరు ఎక్కడిదక్కడే ఇంకిపోయి వెద పొలాలకు మేలు చేకూరుతుందని అర్తమూరు గ్రామ రైతులు తెలిపారు. దీనిపై మండల వ్యవసాయ శాఖాధికారి జి.శివరామకృష్ణ మాట్లాడుతూ వర్షాలు అనుకూలంగా ఉన్నందున మెట్ట దుక్కులు చేపట్టడం మంచిదన్నారు. భూమిలో పదును ఉన్నందున పచ్చిరొట్ట విత్తనాలు కూడా డిపార్టుమెంట్ ద్వారా సరఫరా చేస్తున్నామని తెలిపారు. మండలానికి 60 క్వింటాళ్లు వచ్చాయని ఆయన తెలిపారు. ఒక్కొక్క రైతుకు ఎకరానికి 12 కేజీల చొప్పున అత్యధికంగా 30 కేజీలు 50 శాతం రాయితీపై కేజీ రూ. 22లకు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. పచ్చిరొట్ట విత్తనాలు చవుడు భూములకు ఎంతో ఉపయోగమని రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే సార్వా వరి విత్తనాలు త్వరలో అందుబాటులోకి వస్తాయని ఏఓ పేర్కొన్నారు.

దేవాలయ భూములకు పెరిగిన కౌలు ఆదాయం

గూడూరు: మండలంలోని పలు ఆలయాల భూములకు నిర్వహించిన కౌలు వేలం పాటలకు మంచి స్పందన లభించింది. రాయవరంలోని శ్రీమల్లేశ్వర వేణుగోపాలస్వామి ఆలయానికి చెందిన 20.11 ఎకరాల వ్యవసాయ భూమికి మంగళవారం నిర్వహించిన వేలంపాటలో రూ.5,32,000 పలికినట్లు ఆలయ ఈఓ టి.వి.వి.మోహనరావు తెలిపారు. అలాగే మండల కేంద్రమైన శ్రీవెంకమ్మ పేరంటాలు అమ్మవారి ఆలయానికి చెందిన 6.51 ఎకరాలకు వేలంలో రూ.1,12,000 పలికినట్లు వెల్లడించారు. శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయానికి చెందిన ముక్కొల్లు గ్రామంలోని 23.29 ఎకరాలకు వేలంలో రూ.7,15,000 కౌలు వచ్చినట్లు మోహనరావు తెలిపారు. మూడు ఆలయాలకు కలిపి గతంలో కంటే రూ. 6,89,700లు ఆదాయం పెరిగిందని ఆయన వెల్లడించారు.

ప్రైవేట్ స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి



మచిలీపట్నంఅర్బన్: పాఠ్య పుస్తకాలు, స్టేషనరీ, యూనిఫాంలకు కౌంటర్లు ఏర్పాటు చేసి అమ్మకాలు చేసే ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని బీఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బీఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు దండాబత్తిన కార్తికేయ, ఉపాధ్యక్షుడు మధుసూదన్ మంగళవారం డీఈఓ పీవీజే రామారావుకు వినతిపత్రం సమర్పించారు. అధిక ఫీజుల వసూళ్లపై కూడా చర్యలు తీసుకోవాలని కోరారు.

అంబేడ్కర్ విగ్రహం వద్ద డీబీపీఎస్ నిరసన



నగరంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద నిరసన తెలుపుతున్న డీబీపీఎస్ నాయకులు

మచిలీపట్నంటౌన్: తెనాలిలో ఇద్దరు దళిత, ఒక ముస్లిం యువకుడిపై నడిరోడ్డుపై దాడికి పాల్పడిన పోలీస్ అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని దళిత బహుజన పరిరక్షణ సంఘం(డీబీపీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు అన్నవరపు నాగేశ్వరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సంఘం ఆధ్వర్యంలో ఆ సంఘం నాయకులు మంగళవారం స్థానిక లక్ష్మి సెంటర్‌లోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద నిరసన చేపట్టారు. కార్యక్రమంలో ఎల్ఐసీ ఎస్సీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు శోభన్ కుమార్, దళిత జాయింట్ యాక్షన్ కమిటీ కృష్ణాజిల్లా అధ్యక్షుడు జక్కుల ఆనంద్‌బాబు, డీబీపీఎస్ జిల్లా అధ్యక్షుడు ఎగ్గొని గాంధీ, జిల్లా కార్యదర్శి దాసరి సాంబశివరావు, దళిత ఐక్య వేదిక రాష్ట్ర నాయకుడు మద్దాలి వీరాస్వామి, మాజీ సర్పంచ్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యులు స్థానికంగా నివాసం ఉండాలి



డాక్టర్ ఆశాలతకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

మచిలీపట్నంఅర్బన్: స్థానిక ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది స్థానికంగా నివాసం ఉండాలని జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శేకుబోయిన సుబ్రమణ్యం కోరారు. ఈ మేరకు చర్యలు తీసుకోవాలని మంగళవారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆశాలతకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రొఫెసర్లు, వైద్యులు, స్టాఫ్ నర్సులు స్థానికంగా నివాసం ఉంటే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందుతాయన్నారు. బీసీ నాయకులు అన్సారి, సీ కోటేశ్వరరావు, బోయిన రమేష్, పీ సాంబ, ఎస్సీ నాయకులు పాల్గొన్నారు.

నీటి కుళాయికి మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్



ఎత్తు పెంచిన నీటి కుళాయి

ఘంటసాల: ఘంటసాల నుంచి అంబేడ్కర్ నగర్ వెళ్లే ప్రధాన రహదారి పక్కన చింతచెట్టు వద్ద పంచాయతీ ఏర్పాటు చేసిన నీటి కుళాయి చాలా కిందకు ఉండటంతో బిందెతో నీరు పట్టుకునేందుకు అవకాశం లేక ప్రజలు పడుతున్న ఇబ్బందులను తెలుపుతూ సాక్షి పత్రికలో మంగళవారం కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి సర్పంచ్ బి.వెంకటేశ్వరమ్మ, పంచాయతీ కార్యదర్శి టి.జయలక్ష్మి స్పందించి నీటి కుళాయి ఎత్తు పెంచారు. కుళాయి చుట్టూ పరిశుభ్రం చేసి కాంక్రీటు వేయిస్తామని తెలిపారు.

మట్టి ట్రాక్టర్ ఢీకొని వ్యక్తికి గాయాలు

కోనేరుసెంటర్: మట్టి ట్రాక్టర్ ఢీకొని ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. సేకరించిన వివరాల మేరకు.. పెడన మండలం డీటీపాలెంకు చెందిన మన్యం పాండు అనే వ్యక్తి సోమవారం రాత్రి ద్విచక్ర వాహనంపై మచిలీపట్నం వస్తుండగా మట్టి ట్రాక్టర్ అతన్ని ఢీకొంది. ఈ ఘటనలో పాండు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు చికిత్స నిమిత్తం మచిలీపట్నం సర్వజన ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం విజయవాడకు తరలించారు.

మరో ఘటనలో..

మచిలీపట్నం చల్లపల్లి హైవేపై కారు ఢీకొనడంతో భార్యాభర్తలకు గాయాలయ్యాయి. సేకరించిన వివరాల ప్రకారం.. చల్లపల్లి మండలం మంగళాపురంకు చెందిన పేరం గణేష్, నాగలక్ష్మి బైక్‌పై మచిలీపట్నం వస్తుండగా వెనుక నుంచి వేగంగా వస్తున్న కారు బైక్‌ను ఢీకొంది. ఈ ఘటనలో గణేష్, నాగలక్ష్మిలకు తీవ్రగాయాలు అయ్యాయి. స్థానికులు వారిని మచిలీపట్నం ఆసుపత్రికి తరలించారు. ఇరువురి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం విజయవాడ తరలించారు. ఈ సంఘటనపై ఇనగుదురుపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

యోగాతో మానసిక ఒత్తిడి దూరం



నాగాయలంకలో యోగాసనాలు వేస్తున్న ఉద్యోగులు

గూడూరు: నిరంతరం యోగా సాధనతో మానసిక ఒత్తిడి దూరం అవుతుందని గూడూరు ఎంపీడీఓ ఎం.వనజ పేర్కొన్నారు. యోగాంధ్ర–2025లో భాగంగా మంగళవారం స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో యోగా శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ జూన్ 21 అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా యోగాసనాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. డీవైఈఓ బీఎస్సీ శేఖర్‌సింగ్, యోగా ట్రైనర్ మత్తి అరుణ, సచివాలయ ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాగాయలంక: మండల పరిషత్ ఆధ్వర్యాన స్థానిక జెడ్పీ హైస్కూల్ ప్లస్ ఆడిటోరియంలో మంగళవారం యోగా శిక్షణ నిర్వహించారు. ఎంపీడీఓ పీ ప్రవీణ్ సుధ పర్యవేక్షణలో మండల పంచాయతీ రాజ్ విస్తరణాధికారిణి కే అప్పల నరసమ్మ శిక్షణను ప్రారంభించారు. జెడ్పీ హైస్కూల్ ఫిజికల్ డైరక్టర్ గాజుల లక్ష్మీప్రసాద్, యోగా కోచ్ ఈశ్వర్ యోగాభ్యాసంతో చేకూరే ఆరోగ్య సూత్రాలు, ప్రయోజనాలను వివరించారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల ఉద్యోగులు, డ్వాక్రా సభ్యులు, వెలుగు, ఉపాధిహామీ సిబ్బంది తదితర ఉద్యోగులకు యోగా శిక్షణ ఇచ్చారు. వెలుగు ఏపీఎం కేవై దాసు, వర్రే సుమన్, కే బిందు తదితరులు పాల్గొన్నారు.

చల్లపల్లిలో యోగాంధ్ర ర్యాలీ

చల్లపల్లి: యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో యోగా ట్రైనర్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. మంగళాపురం హైస్కూల్ ఉపాధ్యాయులు నారంశెట్టి వెంకటేశ్వరరావు, పీఈటీ రామకృష్ణప్రసాద్‌లు సచివాలయ సిబ్బందికి యోగాపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ వీ రవిశంకర్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈఓపీఆర్ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అవనిగడ్డ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం వ్యాయామ ఉపాధ్యాయులు సనకా శ్రీకాంత్, మునగాల ఉదయ్ కుమార్, సనకా కోటేశ్వరరావు యోగాలో శిక్షణ ఇచ్చారు. ఎంపీడీవో మరియాదేవి పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ గుడిసేవ విష్ణుప్రసాద్, వంగర శేషగిరిరావు పాల్గొన్నారు.

దుమ్మొకొట్టిన ట్రైనీలు

పెడన: పెడన మండల స్థాయిలో యోగా తరగతులను స్థానిక మార్కెట్ యార్డు ఆవరణలో మంగళవారం నిర్వహించగా పలువురు అధికారులు ఆలస్యంగా హాజరయ్యారు. అంతేకాకుండా మండలంలో 153 మందిని, పట్టణంలో 70 మందిని ట్రైనీలుగా గుర్తించి సమాచారం ఇవ్వగా కేవలం 50 మంది లోపు మాత్రమే హాజరయ్యారు. వీరు వారి వారి ప్రాంతాల్లో ఉదయమే యోగా తరగతులు నిర్వహించాల్సి ఉండటంతో రాలేదనే సమాధానం ట్రైనీల నుంచి వ్యక్తమవుతోంది. ఇదే సమయంలో మండల స్థాయిలో ట్రైనింగ్ క్లాసులు పెట్టడం వల్ల మా ప్రాంతాల్లో తరగతులు నిర్వహించడానికి ఆలస్యమవుతుందనే వాదనను ట్రైనీలు వెలిబుచ్చుతున్నారు. ఏది ఏమైనా మండల స్థాయి ట్రైనింగ్ క్లాస్‌లు పూర్తిస్థాయిలో జరగడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

కోడూరు: స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో రాజకీయ పార్టీల నేతలు, సచివాలయ సిబ్బందికి యోగాపై శిక్షణ ఇచ్చారు. యోగ గురువు ఉల్లి గురురంగ ప్రసాద్, ఎంఈఓ టి.వి.ఎం.రామదాసు యోగ చేయడం వల్ల కలిగే ఆరోగ్య లాభాలను వివరించారు. ఎంపీపీ కొండవీటి వెంకటకుమారి, ఎంపీడీఓ సుధాప్రవీణ్, ఎస్ఐ చాణిక్య, పీఈటీ బీపీఎల్ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఘంటసాల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో యోగాంధ్రపై మంగళవారం వీసీ సమావేశం జరిగింది. ఎంపీడీవో సుబ్బారావు మాట్లాడుతూ యోగాంధ్ర కార్యక్రమాలు షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలని సూచించారు. తహసీల్దార్ బి.విజయప్రసాద్, డెప్యూటీ ఎంపీడీవో కె.వెంకటేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



చల్లపల్లిలో యోగాంధ్ర ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు



పెడనలో శిక్షణకు హాజరైన ట్రైనీలు, అధికారులు

తీరప్రాంత ప్రజలకు ఉచిత వైద్య శిబిరం



వైద్యశిబిరంలో గ్రామస్తులకు సూచనలిస్తున్న వైద్యులు, మెరైన్ పోలీసులు

కోడూరు: పాలకాయతిప్ప మెరైన్ పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో తీరప్రాంత ప్రజలకు మంగళవారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. కోడూరు ప్రభుత్వ వైద్యశాలకు చెందిన వైద్యులు శిరీష సిబ్బందితో కలిసి 220 మంది పాలకాయతిప్ప గ్రామస్తులకు ఉచితంగా వివిధ రకాల వైద్య పరీక్షలు చేసి మందులను అందించారు. మెరైన్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తీరప్రాంత ప్రజల ఆరోగ్య దృష్ట్యా ఈ శిబిరాలను నిర్వహిస్తున్న ఆ శాఖ సీఐ సురేష్‌రెడ్డి తెలిపారు. ఎస్ఐలు పూర్ణమాధురి, ఉజ్వల్‌కుమార్, సీహెచ్ఓ ఎం.లీల, పీహెచ్ఎన్ ఆర్.పుష్పలత, సిబ్బంది పాల్గొన్నారు.

124 మందికి కంటి పరీక్షలు

పులిగడ్డ(అవనిగడ్డ): మండల పరిధిలోని పులిగడ్డ పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం జరిగింది. కార్యక్రమంలో రేపల్లెకు చెందిన శ్రీసాయి కంటి వైద్యశాల డాక్టర్ కిశోర్‌కుమార్, ఎస్ రాజేష్, కే కార్తీక్, ఎస్ నాగలక్ష్మి 124 మందికి వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు, కళ్లజోళ్లు అందించారు. సర్పంచ్ దాసరి విజయ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి బీ అనిత, ఉపసర్పంచ్ మండలి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ పులిగడ్డ పిచ్చేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.